సాక్షి
వికారాబాద్

ఆదివారం : 20 : అక్టోబర్ : 2024



సబ్సిడీపై చేప పిల్లలు

మత్స్యకారుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని తాండూరు ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి అన్నారు. 8లో▸



పేదలకు రాజ్యాధికారమే..

పేదలకు రాజ్యాధికారమే లక్ష్యం సీపీఎం పోరాడుతోందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జాన్‌వెస్లీ అన్నారు. 8లో▸



పట్టణ ప్రగతికి మాస్టర్ ప్లాన్

తాండూరు అభివృద్ధికి మాస్టర్ ప్లాన్ రూపొం దిస్తున్నామని మున్సిపల్ టౌన్ ప్లానింగ్ రీజినల్ డీటీ నర్సింహారెడ్డి తెలిపారు. 9లో▸

న్యూస్‌రీల్

24న బహిరంగ వేలం



అనంతపద్మనాభ స్వామి

అనంతగిరి: అనంత పద్మనాభస్వామి ఆలయంలో కార్తీకమాసాన్ని పురస్కరించుకుని నెలరోజు పాటు కొబ్బరికాయల విక్రయం, దీపారాధన సామగ్రి విక్రయ హక్కుల కోసం ఈనెల 24న బహిరంగ వేలం పాట నిర్వహించనున్నట్లు ఈఓ నరేందర్ తెలిపారు. మధ్యాహ్నం ఒంటిగంటకు ఆలయ ఆవరణలో వేలం పాట ఉంటుందన్నారు. కొబ్బరికాయల వేలంలో పాల్గొనే వారు రూ.లక్ష, దీపారాధన సామగ్రి విక్రయాల వేలంలో పాల్గొనే వారు రూ.10 వేలు ముందుగా డిపాజిట్ చేయాలని సూచించారు. హక్కులు రానివారి డబ్బులను తిరిగి వాపస్ చేస్తారని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

అట్టహాసంగా కళా ఉత్సవ్ పోటీలు

ప్రారంభించిన డీఈఓ రేణుకాదేవి



పోటీల్లో పాల్గొన్న విద్యార్థులతో న్యాయనిర్ణేతలు

అనంతగిరి: వికారాబాద్ ప్రభుత్వ డైట్ కళాశాలలో శనివారం జిల్లాస్థాయి కళా ఉత్సవ్ పోటీలు అట్టహాసంగా జరిగాయి. ఈ పోటీలను డీఈఓ రేణుకాదేవి ప్రారంభించారు. జిల్లాలోని పలు పాఠశాలలకు చెందిన 150 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొని ప్రతిభను చాటారు. ఆరు విభాగాల్లో పోటీలను నిర్వహించారు. నృత్యం, సంగీతం, ఏకపాత్రాభినయం, చిత్రలేఖనం, నాటిక, కథలు చెప్పడం అనే అంశాలపై పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈఓ రేణుకాదేవి మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకత, నైపుణ్యాన్ని వెలికితీసేందుకు ఈ పోటీలు దోహదం చేస్తాయన్నారు. గెలుపొందిన విద్యార్థులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఎంఓ రామ్ మస్తాన్, న్యాయ నిర్ణేతలు శివ జ్యోతి, ప్రవంతి, శ్రీనివాస్, శ్రీకాంత్. నాగరాజు పాల్గొన్నారు.

ఉపకార వేతనాలకు దరఖాస్తు చేసుకోండి

మోమిన్‌పేట: ఎస్సీ విద్యార్థులు 2024–25 సంవత్సరానికి గాను ఉపకార వేతనాల కోసం దరఖాస్తు చేసుకోవాలని వార్డెన్ జైపాల్‌రెడ్డి శనివారం ఓ ప్రకటనలో కోరారు. ఈ పాస్ వైబ్‌సైట్‌లో దరఖాస్తు ఫారం అందుబాటులో ఉందని తెలిపారు. కొత్తగా చేరిన, ఇది వరకే చదువుతున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. ఈ నెల చివరి వరకు చివరి అవకాశం ఉందని తెలిపారు.

రూ.10 కోట్లతో టూరిజం హోటల్

బొంరాస్‌పేట: మండలంలోని నాగిరెడ్డిపల్లి సమీపంలో జాతీయ రహదారి 163పై తెలంగాణ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ వారి ఆధ్వర్యంలో తెలంగాణ టూరిజం హోటల్ ఏర్పాటు చేయనున్నారు. నాగిరెడ్డిపల్లి పరిధిలోని పరమేశ్వరుని గుట్ట సమీపంలో రైతువేదిక దగ్గర ఈ హోటల్ ఏర్పాటు చేసేందుకు సిద్ధమయ్యారు. ఇందు కోసం నెల రోజుల క్రితం సర్వే చేశారు. హోటల్ నిర్మాణానికి రూ.10 కోట్లు మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

మహిళలకు ఉపాధి కల్పించాలి

ప్రగతిశీల మహిళా సంఘం రాష్ట్ర కార్యదర్శి గీత



పరిగి: గ్రామీణ మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని ప్రగతిశీల మహిళా సంఘం రాష్ట్ర కార్యదర్శి వై గీత ఆరోపించారు. శనివారం పట్టణంలో ప్రగతిశీల మహిళా సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళలకు ఉపాధి కల్పించాలి కోరారు. సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో సమానత్వానికి పోరాటం చేయాలని సూచించారు. ప్రతి మహిళకు రూ.2,500 ఇస్తామన్న హామీని ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘ నాయకురాలు పద్మమ్మ, లక్ష్మి, స్వప్న, సింధూ, కావేరి తదితరులు పాల్గొన్నారు.

పట్టుబట్టి.. కొలువుకొట్టి

సండే స్పెషల్



తల్లిదండ్రుల కష్టాలను చూస్తూ పెరిగారు.. బాగా చదివి మంచి ఉద్యోగం సాధించి కుటుంబానికి అండగా నిలవాలని భావించారు.. ఆ దిశగా సాధన చేసి ఇటీవల విడుదలైన డీఎస్సీ ఫలితాల్లో ఉపాధ్యాయ పోస్టులు సాధించి తమ కలలను సాకారం చేసుకున్నారు. భావిభారత పౌరులను తీర్చిదిద్దే 'గురు'తర బాధ్యతను చేపట్టారు. అవరోధాలను దాటుకుని ఉపాధ్యాయ ఉద్యోగాలు సాధించిన వారిపై ప్రత్యేక కథనం..

కుటుంబ భారం మోస్తూనే..



ఉపాధ్యాయుడిగా నియామకపత్రం అందుకుంటున్న మొగులయ్య

తాండూరు రూరల్: డిగ్రీ చదివే సమయంలో తండ్రి మరణించాడు. దీంతో ఇంటికి పెద్ద దిక్కు అయ్యాడు. ప్రైవేటు ఉద్యోగం చేస్తూ ఉన్నత చదువులు చదివాడు. కష్టపడి ప్రభుత్వ ఉద్యోగం సంపాధించాడు మొగులయ్య. తాండూరు మండలం అంతారం గ్రామానికి చెందిన వడ్డె రాజప్ప, అనంతమ్మ దంపతుల పెద్ద కుమారుడు వడ్డె మొగులయ్య. డిగ్రీ చదివే సమయంలో తండ్రి రాజప్ప మృతి చెందాడు. కష్టపడి డిగ్రీ, బీఈడీ పూర్తి చేశాడు. పదేళ్లపాటు ప్రైవేటు స్కూల్, కళాశాలల్లో టీచర్‌గా పని చేశాడు. రెండుసార్లు ప్రభుత్వ ఉద్యోగం కోసం ప్రయత్నించాడు. కానీ ఫలితం దక్కలేదు. ఎలాగైనా ప్రభుత్వ కొలువు సాధించాలనే తపనతో రాత్రి, పగలు కష్టపడి చదివాడు. డీఎస్సీ ఫలితాల్లో ఎస్ఏ ఉద్యోగం సాధించాడు. ప్రస్తుతం బషీరాబాద్ మండలం ఎక్మాయి ప్రభుత్వ పాఠశాల్లో టీచర్‌గా పని చేస్తున్నారు. కష్టాలను అధిగమించి ప్రభుత్వ ఉద్యోగం సాధించిన మొగులయ్యను గ్రామస్తులు అభినంధించారు.



తాండూరు ప్రభుత్వ పాఠశాలలో పాఠాలు బోధిస్తున్న శ్రీశైలం

ఒకే ఒక్కడు..

తాండూరు టౌన్: రాష్ట్ర వ్యాప్తంగా కేవలం వికారాబాద్ జిల్లాకు మాత్రమే కేటాయించిన ఒకే ఒక్క సంస్కృత పండిట్ పోస్టును తాండూరు మండలం మల్కాపూర్‌కు చెందిన దోమ శ్రీశైలం సాధించారు. శ్రీశైలం పదో తరగతి వరకు గ్రామంలోనే చదివాడు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా వ్యవసాయ పనులు చేస్తూ, పాలు, కూరగాయలు విక్రయించాడు. 2003లో ఇంటర్, అనంతరం డిగ్రీతో పాటు ఐదు పోస్టుగాడ్యుయేషన్ కోర్సులు పూర్తి చేశారు. 2012లో అరమార్కు, 2017లో ఒక్క మార్కు తేడాతో టీచర్ పోస్టు చేజారిపోయింది. ఇటీవలి డీఎస్సీలో జిల్లాకు కేటాయించిన ఒకే ఒక్క సంస్కృత పండిట్ పోస్టుకు ఆరుగురు పోటీ పడగా శ్రీశైలం ఉద్యోగం సాధించాడు. ప్రస్తుతం తాండూరు పట్టణంలోని ప్రభుత్వ పాఠశాల(జూనియర్ కళాశాల)లో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నారు. శనివారం శ్రీశైలంను 'సాక్షి' పలకరించింది.. ఆయన మాటల్లోనే.. 'ఒక లక్ష్యాన్ని ఎంచుకున్నప్పుడు దాన్ని సాధించడానికి నిరంతరం కృషి చేయాలి. కష్టే ఫలి అనుకుంటూ ముందుకు సాగాలి. విజయం చేజారినప్పుడు నిరాశ, నిస్పృహలకు లోనుకారాదు. తిరిగి పట్టుదలతో సాధన చేస్తూ ఉండాలి. ఒక్క పోస్టు ఉన్నా అది నాదే అనే ఆత్మస్థైర్యంతో ప్రిపేర్ కావాలి. అనేక ఏళ్ల పాటు వేచి చూసిన నేను నిరంతర సాధనతోనే ఉద్యోగం సాధించగలిగాను' అని శ్రీశైలం పేర్కొన్నారు.

సత్తాచాటిన అక్కా చెల్లెళ్లు



నియామక పత్రాలతో గౌతమి, ప్రసన్నలక్ష్మి

దుద్యాల్: హస్నాబాద్‌కు చెందిన ఆర్ఎంపీ డాక్టర్ ఎస్ బిచ్చప్పకు గౌతమి, ప్రసన్నలక్ష్మి అనే ఇద్దరు కూతుళ్లు. డీఎస్సీ ఫలితాల్లో ఇద్దరూ ఉద్యోగాలు సాధించారు. గౌతమి(ఎస్జీటీ) దుద్యాల్ మండలం ఆలేడ్ పాఠశాలలో విధుల్లో చేరగా.. ప్రసన్న కొడంగల్ మండలం రుద్రారం పాఠశాలలో విధులు నిర్వహిస్తోంది.

విద్య నేర్పిన పాఠశాలకే..



దుద్యాల్ జెడ్పీహెచ్ఎస్‌లో డిజిటల్ పాఠాలు బోధిస్తున్న రమేశ్

దుద్యాల్: పదో తరగతి వరకు పాఠాలు నేర్చుకున్న బడిలోనే ఉపాధ్యాయ ఉద్యోగం సాధించాడు. దుద్యాల్ మండలం లగచెర్ల గ్రామానికి చెందిన కావలి రమేశ్ ఇటీవలి డీఎస్సీ ఫలితాల్లో జీవశాస్త్రంలో ఉపాధ్యాయ ఉద్యోగం సాధించాడు. తాను చదివిన దుద్యాల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు టీచర్‌గా నియమించడంతో అతని ఆనందానికి అవధులు లేకుండాపోయాయి. చిన్ననాటి నుంచి కష్టపడి చదివానని అందుకు ఫలితం దక్కిందని ఆనందం వ్యక్తం చేశారు.

కష్టాలకు ఎదురీది..



భార్గవి

కుల్కచర్ల: చౌడాపూర్ మండలం మరికల్ గ్రామానికి చెందిన భార్గవి తండ్రి చనిపోవడంతో తల్లి కష్టాలను చూస్తూ బాధ్యతగా చదువుకుంది. ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో కుటుంబ సభ్యులు భార్గవికి ఆటో డ్రైవర్ వెంకటేష్‌తో వివాహం జరిపించారు. ఇద్దరు ఆడ పిల్లలు, ఒక బాబుకు జన్మనిచ్చింది. అయినా ప్రభుత్వ ఉద్యోగం సాధించాలనే పట్టుదలను మాత్రం వీడలేదు. భార్గవికి భర్త మద్దతు లభించడంతో గురుకుల, కేజీబీవీ, డీఎస్సీ పరీక్షలు రాసింది. అన్నింట అర్హత సాధించింది. ఇటీవల విడుదలైన డీఎస్సీలో స్కూల్ అసిస్టెంట్ తెలుగు పండిట్ ఉద్యోగం సాధించి కొడంగల్‌లోని జెడ్పీహెచ్‌లో టీచర్‌గా చేరింది.

అక్కా చెల్లెళ్లకు టీచర్ కొలువులు



ఉద్యోగ నియామక పత్రాలతో అక్కాచెల్లెళ్లు

బంట్వారం: ఇటీవల విడుదలైన డీఎస్సీ ఫలితాల్లో ఒకే ఇంట్లో అక్కా చెల్లెళ్ల టీచర్ పోస్టులు సాధించారు. వికారాబాద్ పట్టణానికి చెందిన అక్కాచెల్లెళ్లు నిఖతున్నీసా, షాహీయున్నీసా బీఎస్సీ, బీఈడీ పూర్తి చేసి తొలి ప్రయత్నంలోనే డీఎస్సీలో టీచర్ ఉద్యోగం సాధించారు. నిఖతున్నీసా కోట్‌పల్లి మండలం ఇందోల్ ప్రాథమిక పాఠశాలలో ఎస్‌జీటీ టీచర్‌గా విధులు నిర్వహిస్తోంది. సోదరి షాహీయున్నీసా బషీరాబాద్ మండలం మైల్వార్ ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వహిస్తోంది. ఒకే సారి ఇద్దరి కూతుళ్లకు ఉద్యోగం రావడంతో కుటుంబసభ్యులు సంతోషం వ్యక్తం చేశారు.

తండ్రి ఆశయం నెరవేర్చిన కూతుళ్లు



ఉద్యోగ నియామక పత్రాలతో సుధా, శ్రీ కావ్య

దుద్యాల్: దుద్యాల్ మండలం హస్నాబాద్‌కు చెందిన కోట్ల శ్రీశైలం గౌడ్ ఉపాధ్యాయ శిక్షణ పూర్తి చేసి చాలా సార్లు డీఎస్సీ పరీక్షలు రాశాడు. కానీ ఉద్యోగం రాలేదు.. పది సార్లు పరీక్షలు రాసినా ఫలితం దక్కలేదు. తాను సాధించలేక పోయిన టీచర్ పోస్టును తన కూతుళ్ల ద్వారా సాధించాలని సంకల్పించాడు. ఆ దిశగా వారిని చదివించాడు.. ఇటీవల విడుదలైన డీఎస్సీ ఫలితాల్లో శ్రీశైలం గౌడ్ కూతుళ్ల కోట్ల సుధా ఎస్ఏ – గణితం, కోట్ల శ్రీ కావ్య ఎస్జీటీలో ఉద్యోగం సాధించి తండ్రి కలను సాకారం చేశారు. కోట్ల సుధా బొంరాస్‌పేట మండలం రేగడి మైలారం పాఠశాలలో విధుల్లో చేరగా.. కోట్ల శ్రీ కావ్య కొడంగల్ మండలం ఐనన్‌పల్లి పాఠశాలలో విధులు నిర్వహిస్తోంది. ఇద్దరు కూతుళ్ల ఉద్యోగాలు సాధించడంతో కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

పంతులు ఇంట కొలువుల పంట



టీచర్ పోస్టులు సాధించిన కూతుళ్లతో మొగులయ్య దంపతులు

బషీరాబాద్: ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడి ఇంట కొలువుల పంట పండింది. తన ఇద్దరి కూతుళ్లకు డీఎస్సీలో ఎస్‌జీటీ టీచర్లుగా ఉద్యోగాలు వచ్చాయి. కొద్దిపాటి మార్కుల తేడాలో భార్యకు జాబ్ చేజారింది. బషీరాబాద్ మండలం జీవన్గీ ఉన్నత పాఠశాలలో సైన్స్ టీచర్‌గా పనిచేస్తున్న మొగులయ్యకి శిరీష, వినీష, అనూష, అనిల్ అనే నలుగురు సంతానం. వీరిది యాలాల మండలం జుంటిపల్లి గ్రామం. పిల్లల చదువు కోసం తాండూరు పట్టణంలో నివాసం ఉంటున్నారు. ఇటీవల విడుదలైన డీఎస్సీ ఫలితాల్లో చిన్న కూతురు వినీష ఎస్‌జీటీ విభాగంలో జిల్లా స్థాయిలో రెండో ర్యాంకు సాధించగా, మొదటి కూతురు శిరీష 36వ ర్యాంకు సాధించి ఉద్యోగాలు పొందారు. శిరీష మండలంలోని గొట్టిగకుర్చు ప్రాథమిక పాఠశాలలో టీచర్‌గా విధుల్లో చేరగా వినీష తాండూరు నంబర్ -2 పాఠశాలలో టీచరుగా చేరింది. వినీష టీఎస్‌పీఎస్సీ నిర్వహించిన గ్రూప్ 1 పరీక్షలో ప్రిలిమ్స్‌లో అర్హత సాధించి మొయిన్స్‌కు సిద్ధమవుతోంది. గ్రూప్ 1 ఆఫీసర్ పోస్టు సాధించడమే తన చిరకాల స్వప్నమని వినీష తెలిపింది. నాన్నే తనకు ఆదర్శమని పేర్కొంది.

అంధత్వాన్ని జయించి..



రాఘవేందర్

తలకొండపల్లి: కృషి ఉంటే మనుషులు రుషులవుతారని.. పట్టుదల, సాధించాలన్న సంకల్పం ఉంటే వైకల్యం అడ్డురాదని నిరూపించాడు మండల పరిధిలోని పడకల్ గ్రామానికి రాఘవేందర్. చిన్నప్పుడే కంటి చూపు కోల్పోయాడు. తల్లిదండ్రులు వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రమే కావడంతో వారికి చేదోడు వాదోడుగా ఉండాలనుకున్నాడు. ప్రత్యేక శిక్షణ ద్వారా బ్రెయిలీ లిపి నేర్చుకున్నాడు. ఎలాంటి శిక్షణ లేకుండా యూట్యూబ్‌లో పాఠాలు విని డీఎస్సీకి ప్రిపేరయ్యాడు. ఇటీవల నిర్వహించిన డీఎస్సీలో ఉత్తీర్ణత సాధించి ప్రభుత్వ టీచర్‌గా ఎంపికయ్యాడు. మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో పోస్టింగ్ వచ్చింది.



సమావేశంలో మాట్లాడుతున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్

శాంతిబాటలో పయనిద్దాం

శాసన సభ స్పీకర్ ప్రసాద్‌కుమార్

అనంతగిరి: ప్రపంచానికి శాంతి సందేశాన్ని అందించిన ఘనత మనదేనని శాసన సభ స్పీకర్ ప్రసాద్ కుమార్ అన్నారు. శనివారం వికారాబాద్‌లో అఖిల భారత శాంతి సంఘీభావ సంఘం ప్రథమ మహాసభలు నిర్వహించారు. ఏఐపీఎస్ఓ నాయకుడు కొత్వాల్ ఒబేదుల్లా అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశానికి స్పీకర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ప్రపంచ శాంతి ఉద్యమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. బుద్ధుడు, మహాత్మా గాంధీజీ శాంతి సందేశం ప్రపంచానికి మార్గదర్శకమన్నారు. మహాత్ముడు అహింస అనే ఆయుధంతోనే దేశానికి స్వాతంత్ర్యం సాధించిన మహానేత అని గుర్తు చేశారు. శాంతి స్థాపనతోనే ప్రపంచ దేశాలు సుఖసంతోషాలతో విరాజిల్లుతాయన్నారు. ప్రపంచంలో శాంతికి కృషి చేస్తున్న సంస్థను అభినందించారు. అనంతరం ఆయన సంస్థ సభ్యత్వం తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల, ఏఐపీఎస్ఓ జాతీయ సలహాదారు యాదవరెడ్డి, రఘుపాల్, డాక్టర్ సమత రోషిని, జాతీయ అధ్యక్షవర్గ సభ్యులు డాక్టర్ డి.సుధాకర్, రాష్ట్ర సమన్వయ కార్యదర్శి కేపీఎల్, జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ విజయ్‌కుమార్, బీసీ కార్పొరేషన్ మాజీ సభ్యుడు శుభప్రద్‌పటేల్, మున్సిపల్ మాజీ చైర్మన్ సత్యనారాయణ, జిల్లా కమిటీ ముఖ్య ప్రతినిధి అమరేందర్‌రెడ్డి, కన్వీనర్ విజయలక్ష్మిపండిట్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ కేసులకు సత్వర పరిష్కారం



తాండూరులోని మున్సిఫ్ కోర్టును పరిశీలిస్తున్న జిల్లా న్యాయమూర్తి శ్రీనివాస్‌రెడ్డి

- జిల్లా వ్యాప్తంగా 17వేలకుపైగా పెండింగ్ కేసులు
- గత నెల లోక్ అదాలత్‌లో 3,500 కేసులు పరిష్కారం
- త్వరలో తాండూరులో అడిషనల్ కోర్టు
- జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ సున్నం శ్రీనివాస్‌రెడ్డి

తాండూరు: జిల్లాలోని అన్ని కోర్టుల్లో 17వేల పైచిలుకు కేసులు పెండింగ్‌లో ఉన్నాయని జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్.సున్నం శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. శనివారం పట్టణంలోని మున్సిఫ్ కోర్టును జిల్లా అదనపు న్యాయమూర్తి చంద్రకిషోర్, తాండూరు మున్సిఫ్ కోర్టు న్యాయమూర్తి శివలీతో కలిసి పరిశీలించారు. నూతనంగా నిర్మించిన అడిషనల్ కోర్టు భవనాన్ని పరిశీలించారు.. తాండూరు కోర్టుకు సంబంధించిన పలు సమస్యలను పరిష్కరించాలని బార్ అసోసియేషన్ ప్రతినిధులు, న్యాయవాదులు జిల్లా న్యాయమూర్తి శ్రీనివాస్ రెడ్డిని కోరారు. మున్సిఫ్ కోర్టు పక్కన ఉన్న 2వేల చదరపు గజాల ఖాళీ స్థలాన్ని కోర్టు ఆధీనంలోకి తీసుకొచ్చి అభివృద్ధి చేయాలని విన్నవించారు. ఆ స్థలం ఎవరిదని న్యాయమూర్తి ప్రశ్నించారు. గతంలో ఇక్కడ కల్చరల్ క్లబ్ భవనం ఉండేదని, ప్రస్తుతం ప్రభుత్వ ఆధీనంలో ఉందని న్యాయవాదులు వివరించారు. ఎలాంటి వివాదాలు లేకుంటే కలెక్టర్‌కు లేఖ రాయాలని సూచించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ప్రజలకు న్యాయ వ్యవస్థపై అవగాహన కల్పించేందుకు గ్రామాల్లో న్యాయవిజ్ఞాన సదస్సులు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఇందుకోసం ప్రత్యేక సెల్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. గత నెల లోక్ అదాలత్‌లో జిల్లా వ్యాప్తంగా 3,500 కేసులకు పరిష్కారం కల్పించడం జరిగిందన్నారు. పెండింగ్ కేసులకు సత్వర పరిష్కారం కల్పించడం జరుగుతోందన్నారు. త్వరలో తాండూరులో సబ్ కోర్టు ఏర్పాటు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అగ్గనూర్ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, సీనియర్ న్యాయవాదులు రాంరెడ్డి, బాలిక శివకుమార్, రవీందర్, శ్రీనివాస్‌రెడ్డి, శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.

దుద్యాల్ హెచ్‌సీకి బంగారు పతకం

సీఎం నుంచి అవార్డు అందుకుంటున్న రాజు



సీఎం రేవంత్‌రెడ్డి నుంచి అవార్డు అందుకుంటున్న ఐటీ హెడ్ కానిస్టేబుల్ రాజు

దుద్యాల్: రాష్ట్ర ఏర్పాటు తర్వాత తొలిసారిగా నిర్వహించిన తెలంగాణ పోలీస్ డ్యూటీ మీట్–2024లో దుద్యాల్ గ్రామానికి చెందిన మునగాలి రాజు సత్తా చాటారు. ఆయన రాష్ట్ర పోలీస్ శాఖలో ఐటీ హెడ్ కానిస్టేబుల్‌గా లక్డీకాపూల్‌లో విధులు నిర్వహిస్తున్నారు. తెలంగాణ పోలీస్ డ్యూటీమీట్ నిర్వహించిన పరీక్షలో వంద మార్కులకు 98 మార్కులు సాధించిన రాజు.. రాష్ట్రస్థాయిలో మొదటి స్థానంలో నిలవడంతో బంగారు పతకం వరించింది. శనివారం నిర్వహించిన ముగింపు ఉత్సవాల్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నుంచి రాజు బంగారు పతకం అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు రూ.5 లక్షల బహుమతి ప్రకటించారు.

రఘువీరారెడ్డికి గౌరవ డాక్టరేట్



డాక్టరేట్ అందుకుంటున్న రఘువీరారెడ్డి

ధారూరు: పీసీసీ ప్రధాన కార్యదర్శి పట్లోళ్ల రఘువీరారెడ్డికి పాండిచ్చేరీ రాష్ట్రంలోని గ్లోబల్ హ్యూమన్ పీస్ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్‌ను అందజేసింది. సామాజిక, రాజకీయ రంగాల్లో సేవలందించినందుకు గాను ఆయనకు శనివారం డాక్టరేట్ అందజేశారు. అనంతరం రఘువీరారెడ్డి పాండిచ్చేరీ మాజీ ముఖ్యమంత్రి నారాయణస్వామి, పార్లమెంట్ సభ్యుడు వైతలింగం, శాసనసభ పక్ష నేత వైద్యనాతన్‌ను అక్కడి పీసీసీ కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా వారు డాక్టరేట్ అందుకున్న రఘువీరారెడ్డిని ఘనంగా సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో పార్టీ ధారూరు మండల అధ్యక్షుడు మాన్‌సింగ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ అశోక్, నాయకులు జాఫర్, ప్రవీణ్‌రెడ్డి, రాజేశ్వర్, జాకీర్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పెద్దేముల్ ఏఓగా పవన్‌ప్రీతమ్



పెద్దేముల్: పెద్దేముల్ మండల వ్యవసాయ (ఏఓ) అధికారిగా పవన్ ప్రీతమ్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పని చేసిన ఏఓ నజీరుద్దీన్ రెండు నెలల క్రితం జనగాం జిల్లా ఆలేరుకు బదిలీ అయ్యాడు. తాండూరు రూరల్ ఏఓ కొమురయ్యకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. నూతన ఏఓ పవన్‌ప్రీతమ్ రావడంతో మండల రైతులు ఆనందం వ్యక్తం చేశారు.

రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు అర్జున్



పూడూరు: రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు అండర్–19 విభాగంలో ఎన్కేపల్లి మోడల్ స్కూల్ విద్యార్థి అర్జున్ ఎంపికైనట్లు పీఈటీ వెంకట్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న అర్జున్ ఫరూక్‌నగర్‌లో నిర్వంచిన పోటీల్లో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా తరుపున సత్తా చాటాడన్నారు. నారాయణపేట్‌లో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో అర్జున్ ఆడనున్నాడు. ఈ మేరకు పాఠశాల ప్రిన్సిపాల్ సరళ అర్జున్‌ను అభినందించారు.

గడిసింగాపూర్ అడవిలో చిరుత కలకలం



కెమెరాలు ఏర్పాటు చేస్తున్న అటవీశాఖ అధికారులు

పరిగి: గడిసింగాపూర్ అడవిలో చిరుతపులి కలకలం రేపింది. శనివారం జీడిగడ్డ తండాకు చెందిన మహిళలు సీతాఫలాల సేకరణకు వెళ్లారు. కొన్ని కాయలు తెంపిన తర్వాత చిరుత కనిపించడంతో మహిళలు భయంతో ఇంటికి పరుగులు తీశారు. వెంటనే అటవీశాఖ అధికారులకు సమాచారం అందించడంతో అధికారులు అడవికి వెళ్లి ఆనవాళ్లను పరిశీలించారు. ప్రజలు ధైర్యంగా ఉండాలన్నారు. జంతువుల సంచారంపై తెలుసుకునేందుకు కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు.

ఆలయాల రక్షణకు సిట్ ఏర్పాటు చేయాలి



అడిషనల్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న వీహెచ్‌పీ జిల్లా నాయకులు

అనంతగిరి: తెలంగాణలోని హిందూ దేవాలయాలపై జరుగుతున్న వరుస దాడులపై సిట్ (స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీం)ఏర్పాటు చేయాలని వీహెచ్‌పీ జిల్లా ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈమేరకు శనివారం అడిషనల్ కలెక్టర్ లింగ్యా నాయక్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. రాష్ట్రంలో హిందూ దేవాలయాలపై దాడులు పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. హిందువుల మనోభావాలను దెబ్బతిసేలా ఎవరు ప్రవర్తించిన కఠినంగా వ్యవహరించాలన్నారు. ప్రతి దేవాలయం వద్ద పోలీసులు పికెటింగ్ ఏర్పాటు చేయాలన్నారు. దేవాలయాల రక్షణ బాధ్యతలను ప్రజలే తీసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు శ్రీకాంత్, ప్రభాకర్ గౌడ్, విద్యాసాగర్, శశిధర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

కుల్కచర్ల: అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పోలీసులు సీజ్ చేశారు. ఎస్‌ఐ అన్వేశ్‌రెడ్డి తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని ముజాహిద్‌పూర్ గేటు సమీపంలో మూడు క్వింటాళ్ల బియ్యాన్ని ఆటోలో తరలిస్తున్న క్రమంలో పోలీసులు గుర్తించారు. ఆటో ఆపి తనిఖీ చేపట్టగా తరలింపునకు అనుమతులు లేవు. దీంతో ఆటోను స్టేషన్‌కు తరలించి శ్రీకాంత్‌పై కేసు నమోదు చేశామన్నారు.

ప్రయాణం.. భయం!



ఫొటోలో కనిపిస్తుంది నీటి గుంట కాదు.. చెన్‌గేస్‌పూర్ గ్రామానికి వెళ్లే ప్రధాన రోడ్డు.. పట్టణం నుంచి చెన్‌గేస్‌పూర్ వెళ్లే మార్గం పూర్తిగా గుంతల మయంగా మారి కుంటను తలపిస్తోంది. దీంతో అటుగా వెళ్లే ప్రయాణికులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని రాకపోకలు సాగిస్తున్నారు. చెన్‌గేస్‌పూర్, ఎల్మకన్నె ఎక్కువగా ప్రయాణిస్తుంటారు. రాత్రి సమయంలో గుంతలు కనపించక ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

– తాండూరు రూరల్

సూక్ష్మం.. అందని మోక్షం!

బిందు, సూక్ష్మ సేద్యం పథకం అమలుపై ప్రభుత్వం అలసత్వం ప్రదర్శిస్తోంది. కేవలం ఆయిల్ పామ్ సాగు చేసే రైతులకే సబ్సిడీ అందిస్తుండడంతో ఇతర పంటలు సాగు చేస్తున్న రైతులు ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారు.



ఆయిల్ పామ్ సాగుకే డ్రిప్, స్ప్రింక్లర్లపై సబ్సిడీ

- అంతర పంటల సాగుకు కొరవడుతున్న ప్రభుత్వ ప్రోత్సాహం
- ఆందోళన చెందుతున్న రైతులు

దౌల్తాబాద్: రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమానికి అన్ని విధాల సహకరిస్తామంటున్నా క్షేత్ర స్థాయిలో మాత్రం ఎక్కడా కనిపించడం లేదు. బోర్ల కింట పంట సాగు చేబడుతున్న రైతులు ప్రస్తుతం యాసంగిపై గంపెడాశాలు పెట్టుకున్నారు. బోర్ల కింద సాగు విస్తీర్ణం పెరిగినా ప్రభుత్వం సబ్సిడీపై ఇచ్చే డ్రిప్, స్ప్రింక్లర్లపై నోరు మెదడపం లేదు.

అప్పులు చేసి కొనుగోలు

మండల పరిధిలో రెండేళ్లుగా రైతులు డ్రిప్, స్ప్రింక్లర్లు సెట్ల కోసం ఎదురుచూస్తున్నారు. ఈ ఏడాది రైతులు వేరుశనగ, కూరగాయల సాగు గతేడాదితో పోలిస్తే ఎక్కువగా చేపట్టారు. రైతులు సబ్సిడీ డ్రిప్, స్ప్రింక్లర్ల కోసం అధికారులను ఆశ్రయిస్తే తమకు ప్రభుత్వం నుంచి ఎలాంటి సమాచారం లేదని సమాధానమిస్తున్నారు. దీంతో రైతులు అప్పులు చేసి స్ప్రింక్లర్లను కొనుగోలు చేస్తున్నారు. బహిరంగ మార్కెట్‌లో రూ.20వేలు వెచ్చించి కొనుగోలు చేస్తున్నామంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. హార్టికల్చర్ అధికారులను ప్రశ్నిస్తే బడ్జెట్ లేదంటున్నారు. ఓ వైపు రైతులను అంతరపంటల సాగుకు ప్రోత్సహిస్తూ సబ్సిడీ పరికరాల పంపిణీలో మాత్రం అలసత్వం ప్రదర్శిస్తోంది. దీంతో అన్నదాతలు అప్పులు పాలవుతున్నామంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పెరిగిన సాగు విస్తీర్ణం

ప్రస్తుతం యాసంగిలో రైతులు వ్యవసాయ బోరు బావుల కింద పంటలు సాగు చేశారు. సుమారు 2వేల ఎకరాల్లో వేరుశనగ సాగు చేసినట్లు వ్యవసాయధికారుల గణాంకాలు తెలుపుతున్నాయి. డ్రిప్, స్ప్రింక్లర్లు అద్దెకు సైతం దొరక్క ఇబ్బంది పడుతున్నారు. అధికారులు ప్రజాప్రతినిధులు స్పందించి స్ప్రింక్లర్ల త్వరగా వచ్చేలా చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల రైతులు కోరుతున్నారు.

ఆయిల్ పామ్‌కే సబ్సిడీ స్ప్రింక్లర్లు

ప్రభుత్వం నుంచి వేరుశనగకు సబ్సిడీపై స్ప్రింక్లర్లు అందజేయాలని ఇప్పటి వరకు ఎలాంటి ఆదేశాలు రాలేదు. కేవలం ఆయిల్‌పామ్ సాగు చేసే రైతులకు మాత్రమే ఎస్సీ, ఎస్టీ రైతులకు సబ్సిడీపై అందజేస్తున్నాం. స్ప్రింక్లర సబ్సిడీ విషయమై ప్రభుత్వ ఆధీనంలో ఉంది.

– లావణ్య, ఏఓ

వంద శాతం సబ్సిడీపై చేప పిల్లలు

- మత్స్యకారుల అభివృద్ధికి కృషి
- తాండూరు ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి



చెరువులో చేప పిల్లలను వదులుతున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

బంట్వారం: మత్స్యకారుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని తాండూరు ఎమ్మెల్యే బి.మనోహర్ రెడ్డి అన్నారు. శనివారం కోట్‌పల్లి చెరువులో అన్నాసాగర్ సమీపంలో ఎమ్మెల్యే చేప పిల్లలను వదిలారు. ఈ సందర్భంగా మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ.. మూడు లక్షల చేప పిల్లలను చెరువులో వదిలామన్నారు. మత్స్యకారులు ఐక్యంగా ఉపాధి అవకాశలను మెరుగుపరుచుకోవాలని సూచించారు. వంద శాతం సబ్సిడీపై చేప పిల్లలు పంపిణీ చేశామన్నారు. అనంతరం మత్స్యకారులు తమ సమస్యలను ఎమ్మెల్యేకు వివరించారు. వాటి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. చెరువు సమీపంలో కమ్యూనిటీ హాల్ నిర్మాణంతో పాటు చేపలు పట్టడానికి బుట్టలు పంపిణీ చేయాలని కోరారు. ఇందుకు ఆయన సానుకూలంగా స్పందించి తన సొంత ఖర్చుతో బుట్టలు పంపిణీ చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో మత్స్యశాఖ ఏడీ వెంకన్న, ఎంపీడీఓ డానియల్, మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు ఆనందం, ఏఎంసీ చైర్మన్ అంజయ్య, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నర్సింగ్‌నాయక్, వైస్ చైర్మన్ నారాయణరెడ్డి, నాయకులు శోభారాణి, బందయ్య, మాజీ సర్పంచ్ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించండి



ఇంటింటికీ తిరుగుతూ అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

మలేరియా అండ్ ఫైలేరియా సబ్ యూనిట్ అధికారి పకీరప్ప

దౌల్తాబాద్: సీజనల్ వ్యాధులు, అంటురోగాలపట్ల అప్రమత్తంగా ఉండాలని మలేరియా అండ్ ఫైలేరియా సబ్ యూనిట్ అధికారి పకీరప్ప సూచించారు. శనివారం మండల పరిధిలోని తిమ్మారెడ్డిపల్లిలో రోగాలపై ఇంటింటా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతీ ఒక్కరు పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. మలేరియా, డెంగీ, చికున్ గున్యా, మెదడువాపు వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ తుల్జారాం, ఏఎన్‌ఎం మంగమ్మ, శ్రీధర్‌రెడ్డి, శ్రీనివాస్ తదితరులున్నారు.

మొక్కజొన్నలో తగ్గిన సాంద్రత

రాజేంద్రనగర్ మొక్కజొన్న పరిశోధన కేంద్రం వ్యవసాయ శాస్త్రవేత్త బద్రు నాయక్



ఎన్కేపల్లిలో మొక్కజొన్న కండెలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

మోమిన్‌పేట: మొక్కజొన్న సాగులో సాంద్రత తగ్గిందని రాజేంద్రనగర్ మొక్కజొన్న పరిశోధన కేంద్రం వ్యవసాయ శాస్త్రవేత్తలు బద్రునాయక్, డాక్టర్ మల్లయ్య అన్నారు. శనివారం మండల పరిధిలోని ఎన్కేపల్లిలో రైతు నర్సింలు మొక్కజొన్న పంటను మండల వ్యవసాయాధికారి జయశంకర్‌తో కలిసి శాస్త్రవేత్తలు పరిశీలించారు. రైతు నర్సింలు సాగు చేసిన మొక్కజొన్నకు నాలుగైదు పిలకలు రావడంతో దిగుబడి తగ్గుతుందనే ఆందోళనతో వ్యవసాయాధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో పంట పరిశీలించిన శాస్త్రవేత్తలు సాంద్రత తగ్గిందన్నారు. ప్రతీ వరుసకు 60 సెంటిమీటర్లు, మొక్క మొక్కకు 15 సెంటీమీటర్ల దూరం ఉండాలన్నారు. ఈ పంటలో విత్తనాలు వేసే సమయంలో వర్షాలు సమయానికి కురవ సాంద్రత తగ్గిందన్నారు . సరైన యాజమాన్య పద్ధతులు పాటించడం వల్ల మొక్కకు పిలకలు వచ్చాయన్నారు. కండెలకు గింజలు పూర్తి స్థాయిలో ఆశించిన మేరకు ఉన్నాయన్నారు. దిగుబడిలో తేడా ఉండదన్నారు. ఎకరాకు నాలుగు కిలోల విత్తనాలు విత్తుకోవాలని సూచించారు. ప్రతీ కండెకు 14 నుంచి 18 వరుసలు, ప్రతీ వరుసకు 35 నుంచి 40 వరకు గింజలు ఏర్పడుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ శ్రీనివాస్. రైతులు నర్సింలు, విఠల్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

మైనర్లకు బైక్‌లు ఇవ్వద్దు



విద్యార్థుల పేరెంట్స్‌కు కౌన్సెలింగ్ ఇస్తున్న డీఎస్పీ బాలకృష్ణారెడ్డి

- 25 బైక్‌లు సీజ్
- బాలుర తల్లిదండ్రులకు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి కౌన్సెలింగ్



పోలీసులు సీజ్ చేసిన బైకులు

తాండూరు టౌన్: మైనర్లు బైక్‌లు ఇచ్చే తల్లిదండ్రులు జరిగే పరిణామాలకు సైతం బాధ్యత వహించాలని తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి అన్నారు. శనివారం పట్టణంలో పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా జూనియర్ కళాశాలలకు బైక్‌పై వెళ్తున్న పలువురు మైనర్‌లను అదుపులోకి తీసుకున్నారు. 25 బైక్‌లు సీజ్ చేసి జరిమానా విధించారు. అనంతరం విద్యార్థులు, తల్లిదండ్రులు, కళాశాల యాజమాన్యానికి డీఎస్పీ కౌన్సెలింగ్ ఇచ్చారు. డీఎస్పీ వెంట పట్టణ సీఐ సంతోష్ కుమార్ ఉన్నారు.

పాఠశాల నిర్వహణపై అవగాహన అవసరం

ఎంఈఓ విజయరామారావు




మాట్లాడుతున్న ఎంఈఓ విజయరామారావు

దుద్యాల్: విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పించడంతో పాటుగా పాఠశాలలోని ప్రతీ పనిలో పాలుపంచుకుని బాధ్యతాయుతంగా ఉండాలని ఎంఈఓ నూతన ఉపాధ్యాయులకు సూచనలిచ్చారు. శనివారం స్థానిక విద్యావనరుల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంఈఓ మాట్లాడారు. నూతనంగా విధుల్లో చేరిన ఉపాధ్యాయులకు విధి నిర్వహణ, పాఠశాల కార్యకలాపాలను వివరించారు. తెలంగాణ ఎడ్యూకేషన్, విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజన వివరాలు నమోదు చేసే యాప్‌ల పనితీరును వివరించారు. ఈ కార్యక్రమంలో సీఆర్‌పీ రామ్‌దాస్, నూతన ఉపాధ్యాయులు యాదయ్య, సంగమేశ్వర్, గోవర్ధన్, అనిల్ కుమార్, హన్మంత్, రమేశ్, మాధవి, రాజు, రాధిక, నందిని, దివ్య శ్రీ, గౌతమి, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీని బలోపేతం చేద్దాం

గిరిజన మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కల్యాణ్‌నాయక్



మాట్లాడుతున్న డాక్టర్ కల్యాణ్‌నాయక్

బొంరాస్‌పేట: దేశంలో ప్రధాని నరేంద్ర మోదీ పాలన మచ్చలేనిదని బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కల్యాణ్‌నాయక్ అన్నారు. శనివారం రాత్రి మండల పరిధిలోని తుంకిమెట్ల, బొంరాస్‌పేటలో బీజేపీ మండలాధ్యక్షుడు సీహెచ్.నర్సింలు ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో నిర్మిస్తున్న సీసీ రోడ్ల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వమే నిధులు అందజేస్తుందన్నారు. రుణమాఫీలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. బీజేపీని బలోపేతం చేసేందుకు యువత, గిరిజనం ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బంటు రమేశ్, ఓబీసీ మోర్చా రాష్ట్ర ఎగ్జిక్యూటీవ్ సభ్యుడు బాబాయ్యనాయుడు, గిరిజన మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవీందర్‌నాయక్, ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి జగదీశ్‌సాగర్, ఎస్సీ మోర్చా మండలాధ్యక్షుడు జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

చిరుత సంచారంపై ఆధారాల సేకరణ

- పోచమ్మతండాలో తహసీల్దార్ పర్యటన
- ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచన



పాద ముద్రలను పరిశీలిస్తున్న తహసీల్దార్, అటవీశాఖ అధికారులు

కొడంగల్: మండల పరిధిలోని పోచమ్మతండా శివారులో చిరుత సంచరిస్తున్నట్లు వార్తలు వస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ విజయకుమార్ సూచించారు. ఈ మేరకు శనివారం అటవీశాఖ సిబ్బందితో కలిసి తండాను సందర్శించారు. గ్రామ శివారులో చిరుత ఆనవాళ్లపై స్థానికుడు కల్యాణ్‌నాయక్ సమాచారం ఇచ్చారని తెలిపారు. రాత్రి వేళ బయటకు రావద్దని, పొలాల వద్దకు, పశువులను మేపేందుకు వెళ్లేవారు ఒంటరిగా ఉండవద్దని పేర్కొన్నారు. చీకటి కాకముందే ఇళ్లు చేరుకోవాలని సూచించారు. చిరుత పాద ముద్రలుగా భావిస్తున్న ఆనవాళ్లకు సంబంధించిన ఫొటోలు తీసుకున్నారు. వీటిని ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపిస్తామని చెప్పారు.

పేదలకు రాజ్యాధికారమే లక్ష్యం



పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

- కోటీశ్వరులకే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఊడిగం
- భవిష్యత్ అంతా ఎర్రజెండాదే
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జాన్‌వెస్లీ



మాట్లాడుతున్న జాన్‌వెస్లీ

తాండూరు టౌన్: పేదలకు రాజ్యాధికారమే లక్ష్యం సీపీఎం పోరాడుతోందని పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జాన్‌వెస్లీ అన్నారు. శనివారం పట్టణంలో సీపీఎం 3వ జిల్లా మహాసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం కార్యకర్తలు పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండలంలో నిర్వహించిన మహాసభలకు హాజరైన జాన్‌వెస్లీ మాట్లాడుతూ.. పాలకులు మారినా పేదల బతుకులు మారడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం తీరుతో కొద్ది మంది చేతుల్లోనే దేశ సంపద ఉందన్నారు. విద్య, వైద్య రంగంలో ప్రైవేటు దోపిడీ పెరిగిపోతోందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కోటీశ్వరులకు ఊడిగం చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. 11 ఏళ్ల బీజేపీ పాలనలో పేదలు నిరుపేదలు కాగా, ధనవంతుల సంపద రెట్టింపు అయిందన్నారు. కార్మికులు, రైతులను పట్టించుకునే పరిస్థితుల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు లేవన్నారు. రాష్ట్రంలో అధికారంలోకి రాక ముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నెరవేర్చలేక పోతోందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా ఎర్రజెండా ఆధ్వర్యంలో ప్రజా ఉద్యమాలను నిర్మిస్తామన్నారు. భవిష్యత్ ఎర్రజెండాదేనన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఆర్.వెంకట్రాములు, జగదీశ్, జిల్లా కార్యవర్గ సభ్యుడు కె.శ్రీనివాస్, కమిటీ సభ్యులు చంద్రయ్య, జిల్లా కార్యదర్శి మహిపాల్, వెంకటయ్య, రామకృష్ణ, బుగ్గప్ప, సుదర్శన్, సుభాశ్, మంగమ్మ, సతీశ్, నర్సమ్మ, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

దీపావళి ఆఫర్ పేరిట మోసం

డబ్బులు వసూలు చేసి ఉడాయించిన మోసగాళ్లు



ముగ్గురు సభ్యుల ముఠాలోని ఓ వ్యక్తి

ధారూరు: దీపావళి ఆఫర్‌లో తక్కువ ధరకే ఎలక్ట్రానిక్ వస్తువులు అందజేస్తామని ముగ్గురు మోసాగాళ్లు పలువురికి కుచ్చుటోపీ పెట్టారు. ఈ ఘటన శుక్రవారం మండల కేంద్రంలో శుక్రవారం సాయంత్రం చోటు చేసుకోగా శనివారం బాధితులు పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు తెలిపిన ప్రకారం.. గుర్తు తెలియని ముగ్గురు వ్యక్తులు ఇంటింటికీ తిరుగుతూ దీపావళి ఆఫర్ సందర్భంగా గృహోపకరణ వస్తువులు, ఫ్రిజ్, వాషింగ్ మెషిన్, బీరువాల, సెల్‌ఫోన్‌లో ఫొటోలు చూపుతూ తక్కువ ధరకు అందజేస్తామని నమ్మించారు. ఇది నమ్మిన పలువురు గ్రామస్తులు రూ.3వేల నుంచి రూ.6వేల వరకు అందజేశారు. గ్రామంలోని ప్రధాన కూడలిలో తమ వాహనం ఉందని తీసుకువస్తామని నమ్మించి అక్కడ నుంచి ఉడాయించారు. బాధితులు ఎంత సేపు ఎదురు చూసినా రాకపోవడంతో వారిచ్చిన నంబర్‌కు ఫోన్ చేయడంతో స్విచ్ఛాఫ్ వచ్చింది. దీంతో మోసపోయామని గ్రహించిన గ్రామస్తులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఓ బాధితుడు అనుమానంతో ఓ గుర్తు మోసగాడిని తన ఫోన్‌లో ఫొటో తీసుకున్న ఆధారాన్ని పోలీసులు అందజేశాడు. ఎస్‌ఐ పీఎస్‌లో అందుబాటులో లేరు. మోసగాళ్లను పట్టుకుంటామంటూ పోలీసులు బాధితులకు వివరించి పంపించేశారు.

గుర్తు తెలియని వ్యక్తి బలవన్మరణం

తాండూరు టౌన్: గుర్తు తెలియని ఓ వ్యక్తి రైలు కిందపడి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన తాండూరు రైల్వే స్టేషన్‌లో శనివారం చోటు చేసుకుంది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ వీరేశం తెలిపిన ప్రకారం.. పర్భని ఎక్స్‌ప్రెస్ తాండూరు స్టేషన్‌కు చేరుకుంటున్న సమయంలో సుమారు 40 ఏళ్లు ఉన్న ఓ వ్యక్తి రైలు చక్రాల కింద తలపెట్టి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదు. ఆయన తెలుపు, నీలం రంగు చెక్స్ షర్ట్, నల్ల ప్యాంటు ధరించాడు. శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం తాండూరు ప్రభుత్వాస్పత్రి మార్చురీకి తరలించారు. మృతుడి సంబధీకులుంటే 8712513854 నంబర్‌లో సంప్రదించాలన్నారు.